
# పాపు

వి.కె.దుర్గాదేవి



'చిన్నా! ఈ కవరు పోస్టులో వేసిరావే. పోటీకి పంపే కథలు చేరవలసిన ఆఖరుతేదీ ఇంక రెండు రోజులే వున్నది" అని అంటూ చిన్నా చేతికి కవరు ఇచ్చింది సింధూరి.

తుర్రుమంటూ తూనీగలాగ పరుగెత్తుకుంటూ వెళ్ళింది చిన్నా. చిటికెలోనే వగరుస్తూ వచ్చిన చిన్నాని చూసి, 'అప్పుడే వేసి వచ్చావుటే పీ దుంప పిలకెయ్యా, అంతలా వగరుస్తున్నావు' అన్న సింధూ మాటలకు, 'ఇక్కడేగా అక్కా! లగెత్తుకుంటూ వెళ్ళి వేసివచ్చా' అంది చిన్నా. 'సర్లే, త్వరగా పనికానీ, మీ అయ్యగారు సిని మాకి వెళ్దామన్నారు. ఆలస్యమైతే అరుస్తారు' అంటూ స్నానానికి వెళ్ళింది సింధూ. సినిమాకు వెళ్లే సంబరంతో కూనిరాగాలు తీస్తూ చకచకా పనికానిచ్చి తనూ ముస్తాబైంది చిన్న.

సింధూరి స్నానం కానిచ్చి ప్రకాష్‌కు ఇష్టమైన గులాబి చీరలో మెరుపుతీగలాగా తయారు అయింది. ఇంతలో రానేవచ్చాడు ప్రకాష్. గులాబి బాలలాగా తయారైన భార్యను మురిపెంగా చూస్తూ, ముద్దులు మురిపాలు మధ్య మధ్య నంజుకుంటూ టిఫిన్, కాఫీ, స్నానం కానిచ్చాడు. స్కూటరు తీస్తుంటే, 'పాపం! చిన్నాని కూడా తీసుకువెళ్దామండీ, ఒక్కత్తీ వుండాలి కదా మనం వచ్చేదాకా' అన్న సింధూ మాటలకు చిరాకనిపించింది ప్రకాష్‌కి ఒక్క క్షణం. అంతలోనే విచక్షణ వెన్నుతట్టింది. తను ఉదయం 8 కల్లా ఆఫీసుకువెళ్తే, తిరిగి సాయంత్రమే ఇంటికి రావడం. అప్పటి వరకూ సింధూ ఒంటరిగా వుండకుండా, ఆ పని ఈ పని చేసిపెడ్తూ అమాయకంగా ప్రశ్నలడుగుతూ ఎంతో కాలక్షేపంగా, తోడుగా వుంది చిన్నా. కృష్ణా జిల్లాలో చక్కని పల్లెటూరు సింధు పుట్టిల్లు. మామగారు భాస్కరరామయ్యగారు మంచి సంస్కారమున్న వ్యక్తి. ఇద్దరు అన్నలు, తల్లి తండ్రి ఆప్యాయతల మధ్య ఒక్క గానొక్క ఆడపిల్లగా ఎంతో అపురూపంగా పెరిగింది. గారాబంగా పెరిగినా చదువుసంస్కారం, పనిపాట, క్రమశిక్షణలతోపాటు చిన్న చిన్న కథలతోపాటు, కమ్మని పిండివంటలు కూడా వ్రాసి పత్రికలకు పంపి వర్ధమాన రచయిత్రిగా గుర్తింపులోకి వస్తోంది ఇప్పుడిప్పుడే. చూడగానే మంచి రంగుతో, చక్కని కుదిరికైన శరీరంతో, అందమైన జడతో, మొదటి చూపులోనే ప్రేమింపబడి ప్రకాష్‌కి అర్ధాంగి కాగలిగింది. అన్నివిధాలా ఆమెకు తగిన వరుడిగా, ఇద్దరూ చూడచక్కటి జంట అని ముచ్చటపడేలాగా వుంటాడు ప్రకాష్, సింధూ. అందర్నీ వదిలిపెట్టి పరాయి రాష్ట్రంలో కాపురానికి వెళ్తున్న కూతురికి తోడుగా, తమ పాలేరు కూతురు చిన్నాని తోడుగా పంపారు మామగారు. అది కూడా ఎంతో చేదోడువాదోడుగా వుంది సింధూకి. కాని ఒక్కటే చిక్కు దానితో. పెళ్ళైన తొలి రోజులు. సింధూని ఒక్క క్షణం వదలాలనిపించదు తనకు. విధిలేక ఆఫీసుకు వెళ్తున్నాడేకాని మనసంతా భార్య గురించే ఆలోచనలు. ఆఫీసు నుంచి రాగానే ఎదురువచ్చిన భార్యని ఆత్రంగా, తమకంతో దగ్గరకు తీసుకోగానే, ఏ మూల నుండో ఇంతింత కళ్ళతో, కళ్లనిండా ఆశ్చర్యంతో చూస్తుంటుంది చిన్నా వింతగా ఆ జంటని. ఏ క్షణం సింధూని ముద్దులతో ముంచెత్తుతున్నా ఎక్కడో అక్కడ నుంచి చిన్నా గమనిస్తూనే వుంటుంది. అయ్యగారు ఇంటికి రాగానే అక్కని ఎందుకలా గుండెలకు హత్తుకుంటాడో, పసిపిల్లలను ముద్దాడినట్టు ఎందుకలా ముద్దులు పెట్టుకుంటాడో ఆ పసి మనసుకు అర్థంకావడం లేదుకాని, చూడటానికి ఎంతో బాగుండి, అయ్యగారు వచ్చే వేళకు చాటుగా నుంచుని అన్నీ చూడాలనిపిస్తుంది ఎనిమిదేళ్ళ చిన్నాకి. అందుకే ప్రకాష్ దాన్ని ఎప్పుడూ 'పాపు' అని పిలుస్తుంటాడు.

దసరా కథల పోటీకి పంపడానికి కథ రాసింది సింధూ. భర్త కూడా చదివి ఓకే చేసిం తర్వాత ఫెయిర్ చేసి ఆ పత్రిక అడ్రసు వ్రాసి చిన్నాకిచ్చి పోష్టులో వేయమంది.

కథల పోటీ ఫలితాలు తెలిసే సమయం వచ్చింది. ఆత్రంగా వారపత్రిక తెప్పించి, గుండె దడదడలాడుతూండగా. పరీక్ష ఫలితాల కోసం చూసే విద్యార్థిలాగా గబగబా వెతికింది. పోటీ కథల్లో ప్రైజువస్తే పత్రికవారు ముందు తెలియజేస్తారని, కాంప్లిమెంటరీ కాపీ పంపుతారని ఆ సమయంలో ఆమె మరచిపోయింది. పోటీ కథల విజేతల పేర్లలో తన పేరు

లేదు. కాని తను వ్రాసిన కథ పేరు గల 'పాప మనసు' అనే కథకే ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. ఆ రచయిత్రి ఎవరోకాని తనలాగే ఆమె కథకు కూడా 'పాప మనసు' అని పేరుపెట్టుకుంది. నిరాశగా నిట్టూర్చింది సింధూ. "పోనీలేవోయ్, ఈసారి ఇంకా బాగా వ్రాయి. పెళ్ళైన కొత్త రోజులు కదా మనకు. వివాహం విద్యానాశాయ అన్నట్టు కొత్త కాపురం రచన నాశాయ అయింది కాబోలు" అని సరదాగా వ్యాఖ్యానించాడు ప్రకాష్.

"సింధూ! పోటీ కథల్లో ప్రైజు పొందిన కథలు ఇందులో వేశారోయ్" అని పత్రిక చేతికిచ్చాడు ప్రకాష్. ఆత్రంగా 'పాప మనసు' బహుమతి పొందిన కథ చదివింది సింధూరి. ఒక్క క్షణం సంతోషం, అంతలోనే ఆశ్చర్యం, ఆపైన నిరాశ కలిగాయి. ఆ కత తను వ్రాసిన కథే. ముమ్మాటికీ సందేహం లేదు. గబగబా వ్రాతప్రతి తెచ్చి పరిశీలించింది. ఒక్క అక్షరం కూడా తేడా లేదు. తన కథే. భర్తను కూడా చూడమన్నది. 'సందేహం లేదు ఇది నీ కథే' అన్నాడు. రచయిత్రి ఎవరా అని చూశారు. 'ఉషారాణి', డాటరాఫ్ డా. కె. రామారావు. తమ ఇంటికి ముందు వీథిలో వుండే డాక్టరుగారి అమ్మాయా ఉషారాణి. ఇదెలా సాధ్యం? కథకు ఇన్స్పిరేషన్ ఒకే ఆబ్జెక్టు కావచ్చు. కాని భాష, భావం, వర్ణన, శైలి ఇవి కూడా అచ్చుగుద్దినట్టుగా వుండడం సాధ్యమా. ఇది యంత్రమా, మాయాజాలమా? తల పట్టుకున్నాడు ప్రకాష్. సింధూకి కూడా ఏమీ తోచడం లేదు ఏం చేయాలో. చాలా ఉక్రోషంగా కూడా వున్నది. హఠాత్తుగా ఆమెకు ఒక ఆలోచన వచ్చింది. బహుశః అలా జరిగి వుండవచ్చుననిపించింది. 'చిన్నా' పిలిచింది. 'ఏంటక్కా' అంటూ వచ్చింది. "క్రిందటి నెల్లో పోస్టులో వేయమన్న పెద్ద కవరు ఎక్కడ వున్న డబ్బాలో వేశావే?" "ఉత్తరాల పెట్టెలోనే వేశానక్కా" పెద్ద పెద్ద కళ్ళతో ప్రశ్నార్థకంగా చూస్తూ అన్నది. 'ఉత్తరాల పెట్టె? ఎక్కడ ఉన్నదే నీవు వేసిన పెట్టె?!' తను పోస్టులో వేయమనడం, అది క్షణంలో వేశానని రావడం సినిమా రీలులాగ గిర్రున తిరిగింది తలలో. "అదేనక్కా మనం పేరంటానికి వెళ్లామే డాక్టరు గారింటికి. వాళ్ళింట్లో గేటుకు లేదూ! ఎర్రపెట్టె. అందులో వేశానక్కా. అక్కా నీ కథకు బహుమానం వచ్చిందా అక్కా?" అంటూ ఆత్రంగా అడిగింది చిన్నా. తన చేత్తో పోస్టులో వేసిన అక్క కథకు బహుమానం వస్తే ఎంత గొప్ప తనకి?

తల గిర్రున తిరిగింది సింధూకి. "ఓసి నీ దుంపతెగా. అందులో వేసుకుంటారుటే ఉత్తరాలు. అందులో వేసేవి వాళ్ళకు వచ్చిన ఉత్తరాలు. మనం వ్రాసిన ఉత్తరాలు పోస్టు బాక్స్‌లో వేయాలి. వాళ్ళ గేటుకు వున్నది లెటర్ బాక్స్. అందులో వేశావా? నీ తెలివి తక్కువవల్ల నా కథా, నా ప్రైజు ఇంకొకళ్లకు పోయాయి కదే" అని కోపంగా అరిచింది సింధూ. ఎంతో నెమ్మదిగా, ప్రేమగా 'వుండే అక్క ఎందుకలా బాధపడుతోందో, తన మీద అంత కోపం ఎందుకు వచ్చిందో అర్థంకాని చిన్నా భయంతో నీళ్ళు నిండిన చక్రాల్లాంటి కళ్ళతో "నీవేగా అక్కా ఆ రోజు గేటుకి ఎర్ర పెట్టె ఏమిటి అని అడిగితే ఉత్తరాల పెట్టె అన్నావు. అందులో ఉత్తరాలు వేస్తారా అంటే వేస్తారు అన్నావు. ఇప్పుడేమో అందులో వేశానని నన్ను తిడుతున్నావు?" అని ఉక్రోషంగా అన్నది. తను ఆ కవరు అందులో వేయడంలో తన తప్పేమీ లేనట్టు. ఆ సంఘటన గుర్తువచ్చింది సింధూకి. ఆ డాక్టరుగారి పెద్దమ్మాయికి సీమంతం అని పేరంటం పిలిస్తే తనూ, చిన్నా వెళ్లారు. వాళ్ళ గేటుకున్న లెటరు బాక్స్‌ని చిన్నా ఆశ్చర్యంగా చూస్తూ అది ఏమిటని అడిగితే తాను యథాలాపంగా చెప్పిన సమాధానం తన ఈ నిరాశకు, నష్టానికి కారణమవుతుందనుకోలేదు. అయినా చిన్న పిల్ల తెలీక పోస్టు డబ్బా అనుకుని వేసిందే అనుకో. లెటర్స్ కోసం వాళ్ళు ఆ బాక్స్ తెరిచినపుడు, ఆ కవరు చూసి పత్రికవాళ్ళ అడ్రసు చూసి మనది కాదు అనుకుని పోస్టు బాక్స్‌లో వేయకూడదా. పోనీ కుతూహలానికి కవరు చింపి కథ చదివినా, వేరే కవరు పెట్టి పోస్టులో వేయవచ్చుకదా. అదీ ఇదీ కాకుండా తన కతను వాళ్ళ పేరుతో వాళ్ళు వ్రాసినట్టుగా కత పత్రిక్కి పంపుతారా! ఫ్రమ్ అడ్రసు చూస్తే తమది అని తెలీదా! తెలుసు కదా. పరిచయమున్న కుటుంబాలే కదా తమ ఇద్దరివీ. ఎప్పుడన్నా ఎదురుబడితే వాళ్ళ ముఖం ఎలా చూస్తాము అనైనా వుండద్దా. ఎంత లీన్‌మెంటాలిటీ అని ఎవరి [illegible] వాళ్ళున్నారు ఆ కొత్త జంట. చిన్నగా వెక్కుతున్న శబ్దానికి ఉలిక్కిపడి చూసింది సింధూ. చిన్నా ఏడుస్తోంది. కడుపులో కదిలినట్టైంది తనకి. పాపం! చిన్నపిల్ల దానికి ఏం తెలుసు, మనషుల్లో ఇంత సంస్కారహీనులు వుంటారని. అక్క కోప్పడ్డదనే దాని బాధ. అదే దాని ఏడుపు. సింధూ నెమ్మదిగా లేచి, చిన్నాని దగ్గరకు తీసుకుంది. "పిచ్చిపిల్లా ఎందుకే ఏడుస్తావు. ఈ కథకు ప్రైజు వస్తే నీకు మంచి అద్దాల లంగా కొందామనుకున్నానే. కానీ ఏం చేస్తాం? ఈసారి కథ వ్రాస్తే, ఆ కవరు లెటర్ బాక్స్‌లో కాకుండా, పోస్టు బాక్స్‌లో వేసిరా. ఈ సంఘటనే ఈసారి నా కథా వస్తువు" అని నవ్వుతూ "ఒసే చిన్నా, నిజంగా మీ అయ్యగారు అన్నట్టు నీవు పాపువేనే. నా కతకు ప్రైజు వచ్చింది కాని, ప్రైజు మాత్రం నాకు రాలేదు" అన్నది సింధూ. "పాపు అంటే ఏంటక్కా?" అమాయకంగా అడిగింది చిన్నా. "అంటేనా? పానకంలో పుడక అని దానర్థం" అంటూ ప్రేమగా చిన్నానెత్తిన ఒక్క జెల్లకాయ ఇచ్చి లేచింది వర్ధమాన రచయిత్రి శ్రీమతి సింధూరి ప్రకాష్. పాపం ఈ రచన ఎవరి పేరుతో వస్తుందో ఈసారి. వేచిచూస్తే మనకేమీ నష్టం లేదు కదా! ఏమంటారు?

## "ఖుషీగా లేను..!"

తమిళనాడులో సంచలనం సృష్టించి, తన అభిమానుల చేత గుళ్ళూ గోపురాలు కట్టించుకున్న ఏకైక కథానాయిక కుషుబూ. హీరో ప్రభు ప్రేమలో పడి భగ్నపడిన సంగతి అందరికీ తెలుసు. విరహావేదనతో తనకున్న డిమాండ్‌ను సైతం కాలదన్నుకొని బొంబాయి వెళ్ళిపోయింది కుష్బూ. ..! మళ్ళీ బాలీవుడ్‌లో వేషాల కోసం తీవ్ర ప్రయ్నాలుచేస్తూ... తన అందాల తమ్ముడిని కూడా హీరోగా వేయడానికి రేయింబవళ్ళు కష్టపడుతోంది! మళ్ళీ బాలీవుడ్ వెండి తెరమీద ఓ పాత కథానాయికని, ఓ కొత్త కథానాయకుణ్ణి మనం చూస్తామన్నమాట!

– న్యూస్ నెట్‌వర్క్

